# రోగులవార్డు

రజనికి భర్తమీద ఒక అభిప్రాయం వుంటే, రామేశ్వర్రావుకు భార్యమీద వేరే అభిప్రాయంవుంది. ఒక్కనాడు కూడా ఈ అభిప్రాయాలు బయటపడలేదు కాబట్టి, ఈ జంట గుర్ంచి వచ్చిన ప్రశంసలు విన్నండి:

"కాలేజీ విద్యార్థినిలా మీ అవిడను ఉంచారు. ఈ క్రెడిట్ మీకు చెందుతుంది. మావారికి ఆ ఉపదేశమేదో మంత్రించండి" అని ఆడవాళ్ళు అతన్ని అడిగితే, మగవాళ్లు "రామేశ్వర్రావు పెరిగే వయస్సును తరిగేటట్లు చేస్తున్నారు. ఆ కౌశలం యేదో మా అవిడకూ చెప్పండి" అని ఆమెను వేధిస్తున్నారు.

"సుఖంగా సరదాగా జీవించడం ఒక కళే. దాన్నెలా అభ్యసించాలో, ఆ చిట్కాలు ఇద్దరూ కలసి రాసి ఏ వీక్లీలోనో ప్రచురించకూడదూ? ఎందరికో ఉపయోగపడుతుంది." ఆడా మగా కలిసి అడిగారు.

రోటరీ క్లబ్బు మీటింగులో రజనీ, రామేశ్వరావులకు 'ఆదర్శజంట' 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' సన్మానాలు అందనే అందాయి.

ఈ జంటకు రెండు భవనాలున్నాయ్. ఒకటి తాము కట్టించుకున్న ఇంట్లో నివసిస్తున్నారు. రెండవది ప్రశంసల భవనం. ఆగస్టు ఒకటవ తేదీన వీళ్లిద్దరి మధ్య వచ్చిన ఒక్క పేచీతో ఈ ప్రశంసల భవనం పేకమేడలా కూలిపోయింది.

ఈ తగువులో రామేశ్వర్రావు ఇన్నేళ్లూ మనసులో దాచుకున్న అభిప్రాయం బయటకు అనేశాడు.

"ఉన్నది జాయింట్ ఎకౌంట్ అయినా – నింపేది నేనే కదా!"

రజని విని ఊరుకుందా?

"అలా గంట కొట్టినట్లు చెప్తున్నారు. సమయానికి తగ్గట్లు నేను 'కీ' ఇవ్వబట్టి కదా ఆ మాత్రం అర్జించగలిగారు!"

అసలు ఈ పేచీ ఎలా మొదలైందంటే – ఆఫీసులో తన పర్సనల్ సెక్రెటరీ సునీత ఉంది కదా., ఆమె తండ్రి పెన్షనరు. ఆఫీసుకు వచ్చి, అమ్మాయి పెళ్లి కుదిరిందని, కాని డబ్బు చాలక పెళ్లి ఆగిపోతుందని భయంగా ఉందని, ఒక పదివేలు అప్పు ఇమ్మని ప్రాధేయపడ్డాడు.

అప్పు నెలనెలా ఎలా తీర్చుకుంటాడో చెప్పాడు. సునీత కూడా మౌనంగా కళ్లల్లో నీరు దాచుకుని ప్రార్థించింది. సరే నన్నాడు. ఇంటికి వచ్చి రజనీతో ఇలా చేశానని చెప్తే –

"పెళ్లయ్యాక మీ సెక్రెటరీ మొగుడు అప్పు తీర్చనిస్తాడా? ఆ పెన్షనర్ తను తినకుండా మీ అప్పు తీరుస్తాడా? ఈ డబ్బు ఇలా విసరకపోతే, మీ మేనకోడలు పెళ్లి ఆగిపోతుందన్న భయమా? మీ కష్టార్జితంలో ఇంత డబ్బు తగలెయ్యడానికి నేను యిష్టపడను. కావలిస్తే వెయ్యో, రెండు వేలో ఊరకనే ఇవ్వండి" అంది.

"మాట ఇచ్చాను. ఇప్పుడెలా కాదనగలను?"

"కనీసం, ఇంట్లో ఫోనుంది కదా – నన్ను అడిగారా?"

"అన్నిటికీ నీ పర్మిషన్ తీసుకోవాలని ఉందా?"

"ఇదేమిటి ఇలా కొత్తగా మాటాడుతున్నారు? ఇంతవరకూ ఒకరికిది ఇద్దామని ఇద్దరం కూడబలుక్కునేవాళ్ళంగదా! ఈ అనవాయితీని తప్పించారెందుకు?"

అప్పుడే వాదనలు రేగి, ఓ క్షణంలో జాయింట్ ఎకౌంట్లూ, గడియారానికి 'కీ' ఇవ్వడాలు బయటపడ్డాయి. ఎవరి అహంకారం వాళ్లు మౌనంతో చల్లార్చుకునే బదులు, పంతాలను పెంచుకున్నారు.

ఒకరోజు ఆఫీసునించి రాగానే రామేశ్వరావు తలుపులూ, కిటికీలూ బిగిస్తున్నాడు. అరిచినా ఇక బయటకు గొంతుక వినపడదుగా.

"ఎందుకిలా చేశావ్...చెప్పు. నీ అనుమానాలేంటో చెప్పు." అరిచాడు.

"ఆ పెన్షనర్‌కి ఉన్నట్లే నాకూ కూతురుంది. నాకు డబ్బు అవసరం ఉంది. ఇంతకీ నాకన్నా మీకు ఆ పెన్షనర్ సెక్రెటరీ ముఖ్యమా?"

"ఇక్కడ ఎవరు ముఖ్యమన్నది కాదు సమస్య. మీ ఇద్దరి జీవితాలలో ఉన్న భేదాలు ముఖ్యం."

"అవేంటో సెలవియ్యండి. ఆవిడలో గొప్పదనం, మీ నోట విని ఆచరించడానికి ప్రయత్నిస్తాను."

"సునీతకు తల్లిలేదు. తండ్రి పెంచాడు. పెద్ద చేశాడు. చదివించాడు. ఉద్యోగం వెయ్యించాడు. ఇంక తండ్రిగా చెయ్యవలసింది ఒక్కటే మిగిలింది – అదే పెళ్ళి. ఇంత చెయ్యగలిగినా ఈ పెళ్ళి చెయ్యలేకపోతున్నానని ఏడ్చాడు. సహాయం అప్పుగా అడిగాడు. మరి నీ సంగతో – పుట్టిన దగ్గరనించీ ఈనాటివరకూ దేనికీ వెతుక్కోలేదే."

"అయితే పదివేలు ఇవ్వక తప్పదన్నమాట!"

"జాయింట్ ఎకౌంట్ ఉందని, నువ్వు కావాలని డబ్బంతా డ్రా చేసేశావు. ఆ చెల్లని చెక్కు తిరిగి నా ముఖాన కొట్టారు. పెళ్ళాం పదుగురిలో నా గౌరవం కాల్చినా, అది ఇంకా స్నేహితుల్లో మిగిలివుంది".

"అందుకే అప్పుచేసి మరీ పదివేలిచ్చారన్నమాట?"

ఆవేళనించీ ఒంటరిగా ఉన్నప్పుడు శత్రువుల్లా, ఇంకెవరి మధ్యన అయినా ఆదర్శజంటగా మసలుతున్నారు. ఇద్దరి మధ్యా అగాధం పెరిగిపోతోంది. వండిన కూరల్లో ఉప్పులేని జీవితంలా మారిపోయింది. అలాంటప్పుడు ఒక ఉత్తరం ఇంటి అడ్రస్సుకే వచ్చింది. మొగుడు పేరున్న కవరు విప్పి చదివి, కాలుకాలిన పిల్లిలా ఒంటరిగా గెంతిన రజని, సాయంత్రం ఆ ఉత్తరాన్ని మొగుడు మీదకు విసిరికొట్టింది.

టైపు చేసిన ఉత్తరం. ఎవరూ సంతకం పెట్టలేదు. ఒకే వాక్యం "ఆగస్టు ఒకటవ తేదీ నుంచి, నీ భార్య జబ్బుమనిషైపోయింది."

"నా పెళ్లాం రోగిష్టిదయిపోయిందని ఆ సునీతతో మొరపెట్టుకున్నారన్నమాట!"

"అబ్బే! నాకేం తెలీదు."

"ఆగస్టు ఒకటో తేదీ – ఆరోజే కదా మీ విసవిసలు మొదలయ్యాయి. ఆవిడగారితో చెప్పగానే ఒక ఆకాశరామన్న ఉత్తరం తయారైపోయింది."

ఇంకా టపాకాయలు పేలే సమయం. ఎవరో వస్తున్న సందడి కాగానే ఇద్దరి గొంతుకలు ఆగిపోయాయి. పని మనిషి. కాస్తోకూస్తో చదువుకున్న మనిషి. దానిని చూడగానే ఇద్దరి ముఖాల్లో కృత్రిమ నవ్వు. అతనిలో ఆ పనిమనిషి గురించే ఒక మెరుపులాంటి ఆలోచన. మరుక్షణంలో నవ్విన పెదాలు కరడుగట్టుకుపోయాయి. పంతాలకు పోయిన వీళ్లిద్దరూ పిరికిపందలై పోయారు. ఏదో భయం ఇద్దరిని ఆవహించింది. అలాంటి సమయంలో ఒక రోజున రామేశ్వరరావు ఆఫీసు అడ్రస్సుకు వచ్చిన ఒక కవరు తీసుకువచ్చాడు. అదీ ఈ ఊర్లో పోస్టు చేసిందే. కానీ లోన తెలుగులో రాసి ఉంది. భార్య ముఖాన విసరికొట్టి గట్టిగా చదువుకో అన్నాడు. రజని విప్పి గట్టిగానే –

"నీ భర్తరోగం మనోరోగం. దానికి మందులేదు. అయినా వేగిరం మనోవ్యాధులను నయంచేసే డాక్టరుకి చూపించు. అవసరమైతే రోగుల వార్డులో చేర్పించు."

"ఇంకెవరిలా రాయిస్తారు?" ఆవేశంతో అన్నాడు.

"నాకు తెలియదు."

"నిజం చెప్పు. నువ్వే పనిమనిషి ద్వారా చెయ్యించావా లేదా?"

"లేదు."

"కొయ్యగా మారిపోయావు. వంగుతావెందుకూ?"

"పచ్చగా ఉన్నాననుకుంటే మీరే వంగండి. వంగి తప్పులను ఒప్పుకోండి."

"తప్పు చెయ్యని నాకు ఆ అవసరం లేదు."

"నేను తప్పుచేయలేదు. నాకూ అవసరంలేదు."

"వచ్చే శనివారం సునీత పెళ్లి. వచ్చిపిలుస్తుంది. ఇంతకీ వస్తావా రావా?"

"నే రాను."

ఈ తృణీకారంతో రాకెట్లు ఢాలి పేలిపోయాయి. ఇల్లు కంపించింది. అప్పుడే వచ్చిన కూతురు ఎదురుగా ఉన్నా లెక్కచెయ్యకుండా ఒకరినొకరు కొట్టుకోవడం తప్పించి, అన్ని రకాల కేకలు వేసుకున్నారు.

ఆ రాత్రి డైనింగుటేబిల్ వద్ద మామూలుగా ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. ఇన్నాళ్ళకు ఈ కూతురు ఎదురుగా బయటపడిపోయామన్న సిగ్గో మరేమిటో, ఆ కృత్రిమ నవ్వు కూడా కరువైపోయింది. జాహ్నవి మామూలుగానే ఉంది. ఎటువంటి మార్పు లేదు. ఆ వేళ చేసిన వంకాయ వేపుడు తింటూ అన్నది – "ఈ వంకాయ వేపుడు తాతయ్యకు ఎంత ఇష్టమో!"

జాహ్నవి స్కూలు చదువులో, మూడేళ్లు తాతయ్య ఇంట్లో గడిపింది. చిన్నపట్నం. చిన్నయిల్లు, పీటలమీద కూర్చునే తిండి. చుట్టూ పచ్చని చెట్లు.... ఏదో మాటాడితేగాని బాగుండదన్నట్లు రజని కాస్సేపయ్యాక –

"మీ తాతయ్యకు కోపం లేదు కదమ్మా!" అంది.

దానికి జవాబు రాకముందే రామేశ్వర్రావు "మీ అమ్మమ్మకు కోపంలేదా?" ప్రశ్నించాడు.

"ఇద్దరికీ కోపం ఉంది" అన్నది జాహ్నవి.

"అమ్మమ్మ కోపం తాతయ్య కోపంకన్నా హెచ్చుకదూ?" ప్రశ్నించాడు రామేశ్వర్రావు.

"ఇద్దరిదీ ఒక్కలాంటి కోపమే. కానీ ఇద్దరికీ కోపం ఒక్కసారిగా రావటం చూడలేదు."

"అదెలా?"

"తాతయ్యకు కోపం వస్తే, అమ్మమ్మ కిక్కురుమనకుండా ఊరుకుంటుంది. అమ్మమ్మకు కోపం వస్తే తాతయ్య మౌనవ్రతం పట్టారు."

"తరువాత ఏం జరుగుతుంది?" అడిగింది రజని.

"తరువాత ఒక్కసారిగా నవ్వడమో, లేకపోతే ఒకరినొకరు సముదాయించుకోవటమో చేస్తారు. ఆ ముడతలుపడ్డ ముఖాల మధ్య వెలిగే ఆ నవ్వును చూస్తుంటే ఇద్దరూ ఎంతో అందంగా వెలిగిపోతుంటారు. మీరు వయస్సులోకూడా ఇలాగే ఉండేవారా అని ఒకసారి అడిగాను. అనాటి అభ్యాసమే ఈనాటి విద్యగా అబ్బిపోయిందన్నారు" అంటూ ఆ దృశ్యం కళ్ళ ఎదురుగా చూస్తున్నట్లు నవ్వుకుంటున్న కూతురు వైపు ఇద్దరూ అలా చూస్తూ ఊరుకున్నారు.

నాలుగు రోజులు గడిచాయి. అయిదో రోజు ఉదయం కూతురు కాలేజీకి వెళ్తుందనుకుంటే డ్రాయింగు రూములో కూర్చుంది. అలా కూర్చునే కాస్సేపట్లో అలా వచ్చిన తండ్రివైపు కళ్లప్పజెప్పి చూస్తోంది.

"ఏం అమ్మా, అలా చూస్తున్నావ్"

"అమ్మను అడగండి."

"జాహ్నవిని ఏమైనా అన్నావా?" కేకవేశాడు. రజని వస్తూ "నా వేపు అలానే చూస్తోంది. మీరేదో అనుంటారు," అంది.

"ఏమైందమ్మా? ఒంట్లో బాగాలేదా?"

జాహ్నవి మాటాడలేదు. మెల్లగా లేచి, తన గదిలోకి వెళ్లి, చిన్న సూట్‌కేసుతో తిరిగి వచ్చింది.

"ఎక్కడికి ప్రయాణం?" తల్లి ప్రశ్నించింది.

"అగష్టు ఒకటో తేదీనుంచి ఈ ఇల్లు ఆసుపత్రిలో రోగుల వార్డు అనుకున్నాను. అయిదు రోజులక్రితం నుంచి ఈ ఇంట్లో భరించలేని కంపు. ఇక ఓ క్షణం ఉండలేను. అమ్మమ్మా తాతయ్యల దగ్గరకు వెళ్ళిపోతున్నాను" అంటూ జాహ్నవి, వీళ్ళ రోగాన్ని కుదర్చడంలో విఫలురాలైన డాక్టరులా, తలవంచుకుని మెల్లగా అడుగులు వేసుకుంటూ ఇంటినించి వెళ్ళిపోయింది.

(విశాఖ రేడియో కేంద్ర ప్రసారం)

(ఉదయం - ఉగాది ప్రత్యేక సంచిక, *1990*)

* * *